**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ,**

**తేది : 08 జూలై, 2019.**

**శ్రీయుత జగన్మోహన్ రెడ్డి గారికి,**
**గౌరవ ముఖ్యమంత్రి,**
**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,**
**అమరావతి.**

సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి శ్రీ పి.మధు రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాము. **– జె.ప్రభాకర్**

**ఆర్యా!**

**విషయం : మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రభుత్వమే నిర్వహించాలి.**

మధ్యాహ్న భోజన పథకం కేంద్ర ప్రభుత్వ సహకారంతో 1995, ఆగష్టు 15న ప్రారంభించబడింది. దీని ప్రధాన ఉద్దేశ్యం బడి పిల్లల సంఖ్య పెంచటం ద్వారా విద్యాభివృద్ధిని సాధించాలన్నదే. మధ్యాహ్న భోజన పథకం అమలు ద్వారా బడి పిల్లల సంఖ్య పెరిగింది. అలాగే 15 శాతం మంది ఈ పథకం ద్వారా గ్రామీణ విద్యార్థుల ఆరోగ్య శాతం మెరుగుపడింది.

**పథకం నిర్వహణ:** మన రాష్ట్రంలో 1995లో కొన్ని స్కూల్స్‌కే పరిమితమైన పథకం 2003 నుండి రాష్ట్ర వ్యాప్తంగా 45వేల స్కూల్స్‌కు విస్తరించింది. ఇందులో ప్రాంతీయంగా ఉన్న సహాయ సంఘాల సభ్యులు ఆహారాన్ని పాఠశాల వద్ద వండి వడ్డిస్తున్నారు. ఈ పద్ధతి ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు దగ్గరగా ఉండి తరచూ పర్యవేక్షించే వీలుంటుంది. వేడి ఆహారం, పోషక విలువలతో పిల్లలు ఇష్టపడి తినడానికి వీలవుతుంది.

**కేంద్రీకృత వంటశాలలు:** 2010 – 2012లో మానవ వనరుల అభివృద్ధిశాఖ ఇచ్చిన నివేదికలో ఎన్‌జిఓలు తయారు చేసిన సంస్థలకు 50శాతం చెల్లింపులను కూడా ప్రభుత్వం నిలిపివేసింది.

**సుప్రీంకోర్టు :–** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2013లో రాష్ట్రంలో సుప్రీంకోర్టు నియమించిన కమీషన్ పర్యటించింది. ఆయా స్వచ్ఛంద సంస్థల్లో తయారవుతున్న ఆహార పదార్థాలను, సరఫరా తీరు తెన్నులను కమిషన్ పరిశీలించింది. ఈ సంస్థలు అనేక అక్రమాలకు పాల్పడుతున్నట్లు కమీషన్ పేర్కొంది. అటెండెన్స్ ప్రకారం కాకుండా పిల్లల సంఖ్యలను ఎక్కువ చూపించి కోట్లాది రూపాయలను ప్రభుత్వం నుండి దండుకుంటున్నట్లు పేర్కొంది. యంత్రాల సహాయంతో అత్యధిక వేడితో టన్నుల కొద్దీ ఆహార పదార్థాలను వండుతుండడం వలన రేడియేషన్ ప్రభావం వల్ల నాణ్యత లేదని చెప్పింది. అర్ధరాత్రి నుండి పదార్థాలను తయారు చేసి ఉదయం నుండే ఆయా స్కూల్స్‌కు పంపిణీ చేస్తున్నందున అన్నం సద్దిసద్దయిపోతున్నదని చెప్పింది. నాణ్యతలేని సరుకులతో వంటకాలు తయారు చేస్తున్నందువలన అవి తినడానికి వీలుగా లేవని కమిషన్ నివేదిక ఇచ్చింది. అందువలనే సుప్రీంకోర్టు స్కూల్స్‌లో వేడి వేడిగా వండి పెట్టాలని ఆదేశాలిచ్చింది.

సుప్రీంకోర్టు ఆదేశాలను చంద్రబాబు ప్రభుత్వం విస్మరించి 2017లో మొత్తం పాఠశాలలను 71 క్లస్టర్లుగా విభజించి అక్షయ, నవప్రయాస, ఏక్తాశక్తి సంస్థలకు అప్పచెప్పుతున్నట్లు ప్రకటించింది. కానీ మధ్యాహ్న భోజనం వారి ఆందోళన మూలంగా కేవలం 10% ఉద్యోగులకు మాత్రమే పరిమితం చేసింది.

**కర్నూలు జిల్లాలో నవప్రయాస భోజనం:** కర్నూలు జిల్లాలో నవప్రయాస సంస్థ అందించిన భోజనం తిన్న విద్యార్థులు 130 మంది అస్వస్థతకు గురయ్యారు. కర్నూలు జిల్లా కలెక్టర్ నవప్రయాసను రద్దుచేయాలని కమిషన్‌కి లెటర్ పెట్టారు.

**నెల్లూరు జిల్లా :** నెల్లూరు జిల్లాలో అనేక పాఠశాలల్లో పిల్లలు భోజనం చేయకపోవడంతో పారవేస్తున్న భోజనాన్ని

పశువులకు వేయడానికి డబ్బాల్లో తోపుడు బండ్ల మీద తీసుకువెళ్తున్న వార్తలు పత్రికల్లో వచ్చాయి. నెల్లూరు రూరల్ మండలంలో పథకాన్ని నిర్వహిస్తున్న ఇస్కాన్ సంస్థను రద్దుచేసి తిరిగి మధ్యాహ్న భోజన వర్కర్లను నియమించారు. తూర్పు గోదావరి జిల్లా తొండంగిలో "మీరు తెచ్చిన భోజనం మాకొద్దని" విద్యార్థులు తిప్పి పంపారు. విశాఖ జిల్లా చోడవరం, భీమిలి మండలాల్లో పిల్లలు ఈ భోజనం మాకొద్దని ఆందోళన చేశారు. తల్లిదండ్రులు నవప్రయాస భోజనాన్ని మా పిల్లలకు వద్దని రాయబారాలు నడిపారు.

**తూర్పు గోదావరి జిల్లా :** తూర్పు గోదావరి జిల్లా బెండపూడికి చెందిన ఏకాత్మశక్తి, అల్లూరి సీతారామరాజు ట్రస్టు నుండి 11 మండలాలకు మధ్యాహ్న భోజనం సరఫరా అవుతుంటే భోజనం సరిగా లేదని విద్యార్థులు 70% తినడం లేదు.

**విశాఖ జిల్లాలో ఇస్కాన్ అక్రమాలు :** విశాఖ జిల్లాలో ఇస్కాన్ సంస్థ సాగరనగర్‌లో 388 బస్తాల బియ్యాన్ని కాకినాడ పోర్టు ద్వారా ఇండోనేషియాకు తరలించడానికి పోతుంటే విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్టణంలో ఇస్కాన్ సంస్థ అందిస్తున్న భోజనాన్ని పరిశీలించేందుకు విజిలెన్స్ ఆఫీసర్స్ మూడు స్కూల్స్‌కు వెళ్లగా అనేక లొసుగులు బయటపడ్డాయి. కె.డి.పి.ఎం(చిన్నవాల్తేరు) 15 మందికి సరిపడా అన్నం తెచ్చి 218 మంది విద్యార్థులకు భోజనం చేసినట్లు రికార్డుల్లో రాసుకున్నారు. ఆర్.బి.ఎం. స్కూల్‌లో ప్రాథమిక స్కూల్ విద్యార్థులకు 100 కిలోల 300గ్రాములు అవసరం ఉండగా 25 కిలోల లోపు బియ్యాన్ని మాత్రమే వండి పంపినట్లు పట్టుబడింది. ఏ.వి.ఎస్.హైస్కూల్‌లో ఉండవల్సినదాని కన్నా 50 కోడిగుడ్లు తక్కువగా ఉన్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు.

**చిత్తూరు జిల్లాలో ఇస్కాన్ నాసిరకం భోజనం :** చిత్తూరు జిల్లా తిరుపతిలో ఇస్కాన్ సంస్థ 32 వేల మంది విద్యార్థులకు తెల్లవారు జామున అర్ధరాత్రి నుండే వండి స్కూల్స్‌కు 8గంటల నుండి పంపిస్తున్నారు. ప్రతి రోజూ పప్పు, సాంబారు తప్ప వేరే పదార్థాలు లేకపోవడం, ఐదు రోజులు కోడిగుడ్డు పెట్టాల్సి ఉండగా చాలా స్కూల్స్‌లో గుడ్డు పెట్టడం లేదు. కోడిగుడ్డు స్కూల్స్‌లో వండి పెడుతున్నారు. కుళ్లిపోయిన కూరగాయలు, శుభ్రత లేకపోవడం, వండిన పదార్థాల్లో పురుగులు ఉన్నాయని ఆరోపణలు ఉన్నాయి.

గత నాలుగు సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని, పథకం లక్ష్యం దెబ్బ తింటుందని అందులో పనిచేస్తున్న 85వేల మంది వర్కర్లు ఆందోళన చేశారు. వారి ఉపాధిని దెబ్బ తీయవద్దని కర్నాటక, తమిళనాడులో పథకం నిర్వహణా తీరును అధ్యయనం చేసి మన రాష్ట్రంలో కూడా ఆ పద్ధతులు అనుసరించాలని కోరుతున్నారు.

నెలకు రూ.1000లే ఇచ్చినా ఇంత కాలం మధ్యాహ్న భోజన కార్మికులు జయప్రదంగా నిర్వహించారు. కారణం అది వారికి జీవనాధారంగా ఉండటమే. పెంచిన రూ.3వేలతో వారికి జీవనాధారం సాగదు. ప్రయివేటుకు ఇస్తే పిల్లలకు నాణ్యమైన ఆహారం లభ్యంకాదు. కనుక ఈ క్రింది చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

**1. మధ్యాహ్న భోజనం కార్మికుల ద్వారా ప్రభుత్వమే పథకాన్ని నిర్వహించాలి.**

**2. ప్రతి నెల 5వ తేదీకి బిల్లులు, వేతనాలు ఇవ్వాలి.**

**3. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెనూ చార్జీలు పెంచాలి.**

**4. వంట గ్యాస్ సబ్సిడీతో సరఫరా చేయాలి.**

**5. నాణ్యమైన బియ్యం, సరుకులు సివిల్ సప్లయి ద్వారా పాఠశాలలకు అందించాలి.**

**6. వర్కర్లకు గుర్తింపు కార్డులివ్వాలి.**

**7. వర్కర్లకు సంవత్సరానికి 2కాటన్ చీరలు ఇవ్వాలి.**

అభివందనములతో...

**(పెనుమల్లి/మధు)**